క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తీరప్రాంతమైన ఉప్పాడ 11 కేవీ పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. సోమన్నపాలెం, రెడ్డిలపాలెం, కాపులుప్పాడ, కె.నగరపాలెం, కాపులదిబ్బడపాలెం, మంగమారిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

- 8వ వార్డు పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి 2 గంటల వరకు గొల్లల ఎండాడ, వరాహిగిరినగర్, బీసీ కాలనీ, శ్రీనివాసానగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, దిశ పోలీస్‌స్టేషన్, దుర్గా నగర్, సందీప్ నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

ఆక్రమిత స్థలంలో నిర్మాణ పనుల అడ్డగింత



నిర్మాణ పనులు అడ్డుకుంటున్న వీఆర్వో గోపీకృష్ణ

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు 4వ వార్డు కె.నగరపాలెం కొండపై సర్వే నెంబర్ 314లో ఓ వ్యక్తి రూ. 50లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, వీఆర్వో గోపీ కృష్ణ ఆక్రమిత స్థలాన్ని పరిశీలించి ఇందులో జరుగుతున్న నిర్మాణ పనులు నిలిపివేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా గతేడాది ఇదే స్థలాన్ని సదరు వ్యక్తి ఆక్రమించగా అధికారులు అడ్డుకున్నారు. స్థానిక నాయకుల సహకారంతో మరలా ఇక్కడ నిర్మాణ పనులు ప్రారంభించారు.

విశ్వశాంతి కోసం నేడు శోభాయాత్ర



శ్రీరాధా మదన్ మోహన్ స్వామి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు అంబరీష దాస, యదురాజా దాస తెలిపారు. పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది అష్టలక్ష్మి ఆలయం వరకు ఈ యాత్ర సాగుతుందన్నారు. ఇటీవల జరిగిన శ్రీరాధా మదన్ మోహన్ స్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాల నేపథ్యంలో విశ్వశాంతి కోసం ఉత్సవ మూర్తులతో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళ వాయిద్యాలు, కోలాటం, సంకీర్తనలతో యాత్ర సాగుతుందన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ



నారాయణేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో పార్వతీ పరమేశ్వరులు

పద్మనాభం: మహాశివరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన గురువారం పలు గ్రామాల్లోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారే వారకు జాగరణ చేసిన మహిళలు శివయ్యను దర్శించుకున్నారు. పద్మనాభంలోని నారాయణేశ్వర, కురపల్లిలోని చంద్ర శేఖర రామలింగేశ్వర, పొట్నూరులోని ఉమా నీలకంఠేశ్వర, విలాస్కాన్‌పాలెంలోని రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతవరంలోని దార కొండపై వెలసిన శ్రీమన్నారాయణేశ్వరస్వామి, గెద్దపేటలోని సుబ్రహ్మణేశ్వరస్వామి, తునివలస, బి.ఆర్.తాళ్లవలసలో గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

చెరువుకు తోడు కోనేరు

అసలే పెద్ద చెరువు నుంచి వచ్చే దుర్గంధంతో సతమతమవుతున్న ఆ గ్రామాల వారికి పోలమ్మ ఆలయం ముందున్న కోనేరు కూడా జత కలిసింది. మురుగు నీరు బయటికి వెళ్లే డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక దుర్గంధంతో, దోమలతో ఇబ్బంది పడుతున్నారు. తరచూ వ్యాధుల బారిన పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



పెరికివీధికి చెరువుకు మధ్య మురుగునీరు

- భరించలేని దుర్గంధంతో సతమతమవుతున్న గ్రామస్తులు
- డ్రైనేజీల్లేక అవస్థలు
- తరచూ వ్యాధులపాలు



కోనేటిలో తాత్కాలిక కాలువల ద్వారా కలుస్తున్న మురుగు

తగరపువలస నుంచి మురుగునీరు డ్రైనేజీ ద్వారా గోస్తనీనదికి మళ్లింపు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు చిట్టివలస జ్యూట్‌మిల్లు పరిసరాలలో నివాసం ఉంటున్న పెరికివీధి, రెడ్డివీధి, క్రిస్టియన్‌పేట, చిల్లవీధి తదితర గ్రామాల ప్రజలు పెద్ద చెరువు సమస్యతో కొంతకాలంగా బాధపడుతున్నారు. చెరువు నుంచి వచ్చే దుర్గంధం భరించలేక సతమతమవుతున్నారు. ఇప్పుడు ఈ గ్రామాల పాలిట గుదిబండగా పోలమ్మ ఆలయం ముందు ఉన్న కోనేరు తయారైంది. ఆయా గ్రామాలకు సరైన డ్రైనేజీ నడుపాయాలు లేని కారణంగా తాత్కాలికంగా మురుగు నీటిని ఈ కోనేటిలోకి మళ్లిస్తున్నారు. కోనేటిలోకి చేరిన మురుగు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో దోమల సంతతి వృద్ధి చెంది ఆయా గ్రామాల పాలిట శాపంగా మారిపోయింది.

విషపురుగులకు నెలవుగా..

కోనేటి చుట్టూ పెరిగిన తుప్పలు విషపురుగులకు నెలవుగా తయారైంది. ప్రస్తుతం ఈ గ్రామాలు, కోనేటి మధ్య తాత్కాలిక డ్రైనేజీలు వ్యాధులకు పుట్టినిల్లుగా తయారయ్యాయి. ప్రతిరోజూ ఇక్కడ పారిశుధ్య పనులు జరగని కారణంగా స్థానికులు దుర్గంధంతో సహవాసం చేస్తూ, ముక్కు మూసుకుని ఇళ్లలో ఉంటున్నారు. ఆయా గ్రామాల డ్రైనేజీలను ఆధునీకీకరించి మురుగునీటిని తగరపువలస వలె గోస్తనీనదిలోకి మళ్లించి ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.



పెరికివీధి, రెడ్డివీధి నుంచి మురుగు నీరు చేరుతున్న కోనేరు

తొలగని చెరువు సమస్య

పెరికివీధిని ఆనుకుని చిట్టివలస పెద్ద చెరువు వేసవిలో అడుగంటినప్పుడు వచ్చే దుర్గంధ సమస్య ఇప్పటికీ తొలగిపోలేదు. గతంలో ఇదే దుర్గంధ సమస్యతో పెరికివీధి వాసులు డయేరియాకు గురయ్యారు. చెరువు చుట్టూ ట్యాంకు బండ్ తరహాలో గట్టు వేసినప్పటికీ పెరికివీధిని ఆనుకుని నిలిచిన మురుగునీరు ఇప్పటికీ ఇక్కడివారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. చెరువు, కోనేరును ఆనుకుని నివాసాలే కాకుండా అమ్మవార్ల ఆలయాలు రెండు , పెద్ద విద్యాసంస్థలు రెండు ఉన్నాయి. చెరువు, కోనేరులకు అవుట్ ఫ్లో లేని కారణంగా వర్షాకాలంలో వీటి చుట్టూ మరిన్ని తాత్కాలిక చెరువులు ఏర్పడుతుంటాయి. యుద్ధ ప్రాతిపదికన ఇక్కడి చెరువు, కోనేరులను ఆనుకుని డ్రైనేజీలు నిర్మించి గోస్తనీనదికి అనుసంధానం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కోనేటిని ప్రక్షాళన చేయాలి



జీవీఎంసీ పారిశుధ్య విభాగం ముందుగా కోనేటిని ప్రక్షాళన చేయాలి. మురుగునీటి వ్యర్థాలు కోనేటిలో కలిసిపోయి బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. కోనేటి చుట్టూ తుప్పలు తొలగించి శుభ్రం చేయించాలి.

– కిలిమి పోలయ్య, చిట్టివలస

డ్రైనేజీలు అత్యంత అవసరం



కోనేరు, చెరువు చుట్టూ గ్రామాలకు సరైన డ్రైనేజీలు లేవు. పెరికివీధిని ఆనుకుని దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీలు భూమిలో కలసిపోయాయి. వర్షం వస్తే ఈ ప్రాంతాలు చెరువుల్లా మారిపోతున్నాయి.

– పిన్నింటి గోవింద, చిట్టివలస

ఇళ్లలోకి క్రిమికీటకాలు



కోనేరు, చెరువును ఆనుకుని నివసిస్తున్నవారు తుప్పల కారణంగా నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నాం.క్రిమికీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయి.దోమలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాములు, కప్పలు, తేళ్లు ఇళ్లలోకి చేరుతున్నాయి. అధికారులు స్పందించాలి. – మైనపు శ్రీను, చిట్టివలస

భక్తజన సంద్రం

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి జాగరణ
- వేలాది మంది పుణ్యస్నానాలు



భీమిలి తీరంలో స్నానాలు చేస్తున్న జనం

కొమ్మాది: భీమిలి తీర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి జాగరణ చేసిన వేలాదిమంది భక్తులు గురువారం తెల్లవారుజాము నుంచి సముద్రంలో పుణ్యస్నానాల కోసం తీరానికి చేరుకున్నారు. శివనామస్మరణతో ఈ ప్రాంతాలన్నీ మార్మోగాయి. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, రుషికొండ ఐటీ జంక్షన్ బీచ్, మంగమారిపేట బీచ్, ఉప్పాడ బీచ్ తదితర ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలాచరించారు. సూర్య దేవునికి అర్ఘ్యం సమర్పించారు. మెరైన్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు, లైఫ్‌గార్డులు భక్తులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారు. ఈ ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసి, పలు చోట్ల వైద్య శిబిరాలు కూడా నిర్వహించారు.

పోటెత్తిన జనం

భీమునిపట్నం: భీమిలి తీరానికి జనం పోటెత్తారు. ఉదయం ఆరు గంటల నుంచి జనం రాక ప్రారంభమైనా, పది గంటల తర్వాత రద్దీ బాగా పెరిగింది. ఎవరికీ ఇబ్బంది కలగకుండా నిర్దేశించిన ప్రాంతాల వద్ద అధికారులు ఏర్పాట్లు చేశారు. బారికేడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు టెంట్‌లు, మంచినీరు ఏర్పాటు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఒకరిద్దరు నీటిలో కొట్టుకుని పోయే పరిస్థితి రాగా.. గత ఈతగాళ్లు వారిని రక్షించారు. వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం సభ్యులు జనానికి పులిహోర, పొంగల్ అందించారు.



రుషికొండ బీచ్ రోడ్డులో రద్దీ



రుషికొండ ఐటీ జంక్షన్ బీచ్‌లో భక్త జనం

పల్లెల్లో అన్నసమారాధనలు



పొడుగుపాలెంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ



పద్మనాభంలో జరిగిన అన్నసమారాధనలో పాల్గొన్న ఎంపీపీ రాంబాబు

తగరపువలస: మహాశివరాత్రి జాగరణ చేసిన భక్తుల కోసం ఆనందపురం, పద్మనాభం మండలాల్లో గురువారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలో శివాలయం వద్ద జరిగిన అన్న సమారాధనను ఉప సర్పంచ్ బంటుపల్లి రమణమ్మ ప్రారంభించారు. పాలవలస పంచాయతీ మెట్టమీద పాలెం, గుడిలోవ మహా కాళేశ్వర ఆలయాల్లోనూ నారాయణసేవ నిర్వహించారు. ముకుందపురం పంచాయతీలో సర్పంచ్ కలిమి గంగరాజు అన్న సమారాధన నిర్వహించారు. బోని గ్రామ పంచాయతీలోనూ అన్నదానం ఏర్పాటు చేశారు.

పద్మనాభంలో..

పద్మనాభం: మండలంలోని పద్మనాభం, మద్ది, తునిపాలెం, విలాస్కాన్‌పాలెం, అనంతవరం గ్రామాల్లో గురువారం అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు. పద్మనాభంలో జరిగిన అన్నదానంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, గాడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అనధికార సంత తొలగింపు



నిర్వాహకులతో సంప్రదింపులు జరుపుతున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు 156/6లోని ప్రభుత్వ భూమిలో అనధికారికంగా నిర్వహిస్తున్న పశువుల సంతను రెవెన్యూ, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. కోర్టు వివాదంలో ఉన్న సుమారు 5ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు అనధికారికంగా సంత నిర్వహిస్తుండడంతో స్థానికులు కొందరు అభ్యంతరం తెలియజేశారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో గురువారం వీఆర్వోలు ఇక్కడ ఉన్న వాహనాలు, పశువులను తొలగించేందుకు ప్రయత్నించారు. అయితే, నిర్వాహకులు ఎదురు తిరగడంతో పోలీసుల సహాయంతో వీటిని తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని, కోర్టు కేసు కూడా పెండింగ్‌లో ఉందని ఆర్ఐ కిషోర్‌కుమార్ తెలిపారు. ఉన్నతాధికారులు అనుమతి లేకుండా ఇక్కడ ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడానికి వీలు లేదని హెచ్చరించారు.

వెలవెలపోయిన దుకాణాలు



సంతబయలులో వ్యాపారాలు లేక ఖాళీగా కనిపిస్తున్న ప్రాంతం

- బోసిపోయిన మార్కెట్ పరిసరాలు

తగరపువలస: మహా శివరాత్రి మరుసటి రోజు అయిన గురువారం లేబర్ హాలిడేను స్థానిక వ్యాపారులు కొందరు విస్మరించారు. స్థానిక వర్తక సంఘం పరిధిలో మూడోవంతు వ్యాపారులు స్వచ్ఛందంగా వ్యాపారాలు మూసి వేసినా, మిగిలిన వారు దుకాణాలు తెరిచారు. అయినప్పటికీ బుధవారం ఉపవాసం, జాగరణ చేసిన భక్తులు ఇళ్లకే పరిమితం కావడంతో వినియోగదారులు బయటకు రాక వ్యాపారాలు సాగలేదు. మరోవైపు విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు లేక సిటీబస్సులు కూడా ఖాళీగా రాకపోకలు సాగించాయి. నిత్యం రద్దీగా ఉండే తగరపువలస ప్రైవేట్ మార్కెట్ పరిసరాలు కూడా మహాశివరాత్రి ఎఫెక్ట్‌తో బోసిపోయాయి.



సంతపేటలో జనసంచారం లేక బోసిపోయిన దుకాణాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అన్నమయ్య కీర్తనలకు అభినయిస్తున్న శ్రీనృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు

తగరపువలస: మహా శివరాత్రి జాగరణ సందర్భంగా చిట్టివలస శివాలయంలో నిర్వాహకులు బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి దాటిన వరకు వివిధ డ్యాన్స్ అకాడమీలకు చెందిన విద్యార్థులు శాస్త్రీయ, జానపద నృత్యాలను అభినయించారు. శ్రీనృత్యప్రియ డ్యాన్స్ అకాడమీ టీచర్ చెట్ల రజనిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మోక్ష, హర్షవర్ధిని, దీపిక, నీలిమ, హాసిని తదితరులు అన్నమయ్య కీర్తనలకు అభినయించారు. అదివో అల్లదివో కీర్తన భక్తుల ప్రశంసలు అందుకుంది. మిగిలిన విద్యార్థులు లవకుశ, పార్వతీ పరమేశ్వరుల కథాగానంతో అభినయించి, భక్తుల మన్ననలు అందుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు విద్యార్థులను బహుమతులతో సత్కరించారు.

పోలింగ్ 87 శాతం



ఆనందపురం పోలింగ్ స్టేషన్ వద్ద సీపీ శంఖబ్రత బాగ్చీ



భీమిలి ఎగువపేట పాఠశాలలో ఓటు వేస్తున్న ఉపాధ్యాయుడు



భీమిలి ఎగువపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు

- ప్రశాంతంగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- నియోజకవర్గంలో 4 పోలింగ్ కేంద్రాలు

కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
భీమిలి	261	241
ఆనందపురం	44	43
పద్మనాభం	85	84
చంద్రంపాలెం	908	763
మొత్తం	1298	1131

తగరపువలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు భీమిలి నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో 87శాతం పోలింగ్ నమోదైంది. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చంద్రంపాలెంలోని నాలుగు పోలింగ్ బూత్‌లలో 1298 మంది ఓటర్లకు గాను 1131 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 44 మందికి 43 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ పోలింగ్‌బూత్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు.

భీమిలిలో 92.3 శాతం..

భీమునిపట్నం: భీమిలి ఎగువపేట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఇక్కడ మొత్తం 261 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం పోలింగ్ పూర్తయ్యే సమయానికి 241మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 92.3 శాతం పోలింగ్ జరిగింది. సీపీ శంఖబ్రత బాగ్చి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, పోలింగ్ తీరు, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఏసీపీ అప్పలరాజు పాల్గొన్నారు.

విశాఖ రూరల్ మండలంలో 84 శాతం..

మధురవాడ: మధురవాడలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 120వ పోలింగ్ కేంద్రంలో 84 శాతం పోలింగ్ నమోదైంది. కేంద్రంలో మొత్తం 908 ఓట్లు ఉండగా 763 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దారు పాల్ కిరణ్ చెప్పారు. పోలింగ్ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరిశీలించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు, ఎస్ఐ భాస్కరరావు తదితరులు ఉన్నారు.



ఖాళీగా ఆనందపురం పోలింగ్ స్టేషన్ సిబ్బంది

పద్మనాభంలో 98.82 శాతం ..

పద్మనాభం: పద్మనాభంలో 98.82 శాతం పోలింగ్ నమోదైంది. 85 మంది ఓటర్లు ఉండగా వీరిలో 84 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 70 మందికి 69 మంది, స్త్రీలు 15 మందికి 15 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీపీ శంఖబ్రత బాగ్చి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

మూలకు చేరిన బోర్లు

పీఎం పాలెం: జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం నిర్లక్ష్యం కారణంగా లక్షలాది రూపాయలు వెచ్చించి భూగర్భ జలాలు వెలికి తీయడానికి ఏర్పాటు చేసిన బోర్లు వృథాగా పడి ఉన్నాయి. నిర్వహణ లోపంతో మూలకు చేరాయి. ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రీనగర్ , జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లోని బోర్లు పూర్తి సామర్థ్యంతో పని చేయడం లేదు. మరికొన్ని కనీస స్థాయిలో నీటినీ అందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోవార్డు పరిధిలో ఏర్పాట్లు చేసిన బోర్లు పరిశీలించాలని, మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.



పీఎం పాలెం హెచ్‌బీ కాలనీలో తుప్పల నడుమ బోరు

మహా పరాక్రమశాలి హనుమ

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: స్వామి హనుమ పరాక్రమం, బుద్ధి వైభవం ముందు ఎవరూ సరిపోరని ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. బ్రహ్మ వరం ఉన్న అప్రతిహతమైన పరాక్రమం, గొప్ప వినయాలతో పాటు శత్రువులో మంచి ఉన్నా శ్లాఘించ గల గొప్ప పక్షపాత రహిత బుద్ధి కలిగినవారని శ్లాఘించారు. మధురవాడ గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణం ప్రవచనాల్లో భాగంగా గురువారం సుందరకాండపై ప్రవచనం కొనసాగింది. హనుమ అశోకవన భంజనములు చేయుట, రావణాసురునకు-హనుమకు మధ్య జరిగిన సంవాదం, లంకాదహనం తదితర ఘట్టాలను చాగంటి వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అన్నంరాజు సత్యన్నారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.